వెల్దుర్తి: ఎల్కపల్లి ఖాన్ చెరువు తూము వద్ద కుంగిన చెరువు కట్ట


మెదక్ రూరల్: పొంగి పొర్లుతున్న రాయిన్‌పల్లి ప్రాజెక్టు, ర్యాలామడుగు చెక్ డ్యామ్

రామాయంపేట: తొనిగండ్ల పులిచేరు కుంట బుంగను జేసీబీతో పూడుస్తున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట: వరద ఉధృతికి కుంగిన మందాపూర్ గిరిజన తండా వద్ద ఉన్న బ్రిడ్జి

వాన బీభత్సం

- అలుగు పారుతున్న చెరువులు, కుంటలు, మత్తడి దుంకుతున్న చెక్‌డ్యామ్‌లు
- పలు చోట్ల చెరువులకు గండి, మరమ్మతులు చేపట్టిన అధికారులు
- దెబ్బతిన్న మొక్కజొన్న, నీట మునిగిన వరి
- కూలుతున్న పెంకుటిండ్లు, పూరి గుడిసెలు

మూడు రోజుల నుంచి కురిసిన వర్షం

మంగళవారం తగ్గుముఖం పట్టింది. రెండు రోజుల నుంచి ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. కొన్ని చెరువులకు గండి పడగా, ఇరిగేషన్ అధికారులు పూడ్చివేయించారు. కొన్ని ప్రాంతాల్లో చెరువు కట్టలు కుంగాయి. భారీ వర్షానికి వరి, పత్తి పంటలు నీటిలో మునిగాయి. ఆయా గ్రామాల్లో పాత ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో అండర్ గ్రౌండ్ పార్కింగ్‌తో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నీట మునిగింది. చెరువులు, వాగులు వరదతో నిండుకుండలా జలకళను సంతరించుకున్నాయి. చెరువులు, అలుగులు పారడంతో ఆయా గ్రామాల ప్రజలు గంగమ్మకు పూజలు చేశారు.

- మెదక్, న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 3

చిన్నశంకరంపేట: టి.మాందాపూర్‌లో కుంగిపోయిన కల్వర్టును పరిశీలించిన ఎంపీడీవో, ఎమ్మార్వో, ఆర్ఐ

మెదక్ మున్సిపాలిటీ: నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో చేరిన వర్షపు నీరు

చేగుంటలో అలుగు పారుతున్న ఊర చెరువు

పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లిలో అలుగు పారుతున్న చెరువు

మెదక్ మున్సిపాలిటీ: భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న ఎమ్ఎన్ కెనాల్

చిలిపిచెడ్: సోమక్కపేటలో భారీ వర్షానికి అలుగు పారుతున్న పెద్ద చెరువు

అలుగు పారుతున్న చిన్నశంకరపేట మండలంలోని గవ్వలపల్లి చెరువు

శివ్వంపేట: తాళ్లపల్లితండాలో కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న డిప్యూటి తహశీల్దార్ షఫియోద్దిన్

చేగుంట మండలం మక్కరాజిపేటలో వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంట

రామాయంపేట: భారీ వర్షాలకు నిండి అలుగు దుంకుతున్న తొనిగండ్ల చెరువు

పెద్దశంకరంపేటలో నేలమట్టమైన ఇల్లు

వెల్దుర్తిలో వరదకు దెబ్బతిన్న పత్తి పంట

భారీ వర్షాలకు నిజాంపేట మండలంలో మత్తడి దూకుతున్న గడీం చెరువు

చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయిలో వర్షానికి కూలిన ఇల్లు

రైతులకు నష్ట పరిహారం అందజేయాలి

బుంగ పడ్డ చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 3: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గండిపడ్డ పెద్ద చెరువును, నీట మునిగిన పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హవేళీఘనపూర్‌లోని పెద్ద చెరువుకు గండి పడి 200 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, పరిహారం కింద ఎకరానికి రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఏడుపాయల టేకుల గడ్డ వద్ద పదిమంది చిక్కుకుంటే హెలికాప్టర్ తెప్పించి సురక్షిత ప్రాంతాలకు తరలించామని గుర్తు చేశారు. తెగిపోయిన ఘనపూర్ పెద్ద చెరువు కట్టకు ఇసుక బస్తాలు వేసి నీటిని ఆ పొలాని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పెద్ద మొత్తంలో నష్టం జరిగిందన్నారు. ఆమె వెంట హవేళీఘనపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, తదితరులున్నారు.

యుద్ధ ప్రాతిపదికన నష్టంపై అంచనా

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 3: అధిక వర్షాలు కారణంగా యుద్ధ ప్రాతిపదికన నష్టాలను అంచనా వేసి ప్రభుత్వ సహాయాన్ని అందజేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. హవేళీఘనపూర్ మండలం దూప్‌సింగ్ తండా బ్రిడ్జి వరద నీటితో కోతకు గురైన సందర్భంగా మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి నష్టాలను అంచనా వేస్తున్నారన్నారు. కోతకు గురైన బ్రిడ్జి వర్క్‌కు టెండర్ వేసి పనులు వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపడుతామన్నారు. వర్షాలు, వరదల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు.

కాంగ్రెస్ రౌడీలపై చర్యలు తీసుకోవాలి

శివ్వంపేట, సెప్టెంబర్ 3: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, పలువురు బీఆర్ఎస్ నాయకులపై దాడిచేసిన కాంగ్రెస్ రౌడీలపై చర్యలు తీసుకోవాలని జడ్పీకోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్ డిమాండ్ చేశారు. మంగళవారం వరద బాధితులను పరామర్శించేందుకు ఖమ్మం జిల్లాకు వెళ్లిన హరీశ్‌రావు, పలువురు నాయకులపై కాంగ్రెస్ రౌడీలు రాళ్లతో దాడిచేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడ డం హేయమైన చర్యగా వర్ణించారు.

వర్షంతో జిల్లాకు మేలు: డీఏవో గోవింద్


ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న డీఏవో

కౌడిపల్లి, సెప్టెంబర్ 3: మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో జిల్లాకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయధికారి గోవింద్ తెలిపారు. మంగళవారం కౌడిపల్లిలోని భాగ్యలక్ష్మి, రైతుసేవా ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. జిల్లాలో 2.75 లక్షల ఎకరాల్లో వరి, 1200 ఎకరాల కందులు, 1200 ఎకరాలు పెసర్లు, 35వేల ఎకరాల్లో పత్తి, ఇతర పంటలు పండిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో చెరువులు, కుంటలు నిండి పొంగిపొర్లడంతో రైతుల్లో ఆనందం వెల్లివెరుస్తున్నదన్నారు.

మేకల దొంగల ముఠా రిమాండ్

- రూ.4.71 లక్షల నగదు, రెండు కార్లు, తొమ్మిది మేకలు స్వాధీనం
- 11 మందిపై 100కు పైగా దొంగతనం కేసులు

మాట్లాడుతున్న అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి

పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 3: ఉమ్మడి మెదక్ జిల్లాలో మేకల దొంగతనానికి పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 16 దొంగతనాలు చేసి సుమారు 100కు పైగా మేకలు దొంగలించిన కేసులో 11 మంది ఉండగా ఆరుగురిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఐదుగురు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.4.71 లక్షల నగదు, 9 మేకలు, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గడిపెద్దాపూర్‌కు చెందిన అనిల్‌కుమార్, ఎరుకల అనిల్, ఎరుకల గోపాల్, ముస్తాపూర్‌కు చెందిన ఖదీర్‌పాషా, మహేందర్, సంగారెడ్డికి చెందిన మహమ్మద్ షాహిద్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్‌పై వైద్య ఉద్యోగి దాడి

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఆశ వర్కర్లు

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 3: ఆశ వర్కర్‌పై చేయి చేసుకుని, అసభ్యకరంగా వ్యవహరించిన ఘటన చిన్నశంకరంపేట పీహెచ్‌సీలో మంగళవారం జరిగింది. చిన్నశంకరంపేట పీహెచ్‌సీలో సమావేశం ఉన్నదని మెడికల్ ఆఫీసర్ సాయిసింధు ఆశవర్కర్‌లకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆశ వర్కర్లు పీహెచ్‌సీకి చేరుకున్నారు. ఇక్కడకు ఎందుకు వచ్చారని ఆశవర్కర్లపై ఎంపీహెచ్ఎస్ సూపర్‌వైజర్ అనిల్ డేవిడ్ అసభ్యకరంగా వ్యవహరిస్తూ విరుచుకుపడ్డాడు. ఆశ వర్కర్ నాగమణిపై చేయి చేసుకున్నాడు. దీంతో అతడిపై చర్యలు తీసుకోవాలని ఆశవర్కర్ల సంఘం మండలాధ్యక్షురాలు దేవమ్మ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మెడికల్ ఆఫీసర్ సాయిసింధు వారితో మాట్లాడి శాంతపరిచారు. ఈ విషయం జిల్లా వైద్యాధికారికి సమాచారాన్ని అందిస్తానని తెలిపారు. అనంతరం ఆశ వర్కర్లు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అనిల్ డేవిడ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు శరత్ చంద్ర ఎంపిక

రామాయంపేట, సెప్టెంబర్ 3: ఫుట్‌బాల్ జాతీయ స్థాయి అండర్ 14 లో శరత్ చంద్ర ఎంపికైనట్లు కోచ్ బొంతల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం పట్టణంలో శిక్షణ తీసుకున్న శరత్‌చంద్ర జిల్లా, రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచారు. అస్సాంలో జరిగే పోటీల్లో ఆయన పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 3: రాష్ట్రంలో బీసీల కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ ఆంజనేయులు మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కామారెడ్డి సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు.

వరద బాధితులకు విరాళం

మెదక్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): టీఎన్జీవో ఆధ్వర్యంలో ఒక రోజు వేతనాన్ని సీఎం సహాయ నిధికి ప్రకటిస్తున్నట్లు టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ తెలిపారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినందున ప్రభుత్వానికి అండగా ఉండేందుకు తమవంతు సాయంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు.

రేషన్‌కార్డు లేని రైతుల వివరాల సేకరణ

వెల్దుర్తి/చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 3: రుణమాఫీ జాబితా లో పేరుండి రేషన్ కార్డు లేని రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు ఏవో ఝాన్సీ తెలిపారు. మంగళవారం వెల్దుర్తి రైతు వేదికలో వెల్దుర్తి క్లస్టర్ పరిధిలోని రైతుల ఆధార్ కార్డుల ప్రకారం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అర్హులైన రైతులకు పంట రుణమాఫీని అందించడానికి కృషి చేస్తున్నామని ఏడీఏ విజయనిర్మల తెలిపారు. ఒకే కుంటుంబంలో ఎంత మందికి రుణమాఫీ అయ్యింది అనే వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలన్నారు.

మట్టి విగ్రహాలనే పూజించాలి

- నవరాత్రి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

మెదక్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): వినాయక చవితి సందర్భంగా ప్రతిఒక్కరూ మట్టి గణపతులు ప్రతిష్ఠించి పూజించాలని, తద్వారా నీటి వనరులు కలుషితం కాకుండా చూడాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, మున్సిపాలిటీ, మత్స్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన పర్యావరణ అనుకూల, సహజ రంగులు ఉపయోగించి తయారు చేసిన మట్టి విగ్రహాలని పూజించాలన్నారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి ఉత్సవ కమిటీలతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. గణపతి నిమజ్జనం జరిగే చెరువులు, వాగులు, గోదావరి నది వద్ద పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ తీగల కింద, విద్యుత్ స్తంభాలు పక్కన మంటపాళ్లను ఏర్పాటు చేయకుండా నియంత్రించాలన్నారు. అనంతరం మట్టి వినాయకులను నెలకొల్పి పూజించాలని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త రవీందర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి పాల్గొన్నారు.

గురుకులంలో అధికారుల విచారణ

గురుకుల పాఠశాలలో విచారణ చేస్తున్న అధికారులు

తూప్రాన్, సెప్టెంబర్ 3: తూప్రాన్ టోల్ ప్లాజా వద్దనున్న గురుకుల పాఠశాలలో సోమవారం జూనియర్లు, సీనియర్ల మధ్య జరిగిన దాడి ఘటనపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ కృష్ణతో పాటు అధికారులు పాల్గొన్నారు. 9వ తరగతి విద్యార్థులపై పదో తరగతి విద్యార్థులు దాడి చేయడంతో ముగ్గురికి గాయాలైన సంగతి తెలిసిందే. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

చీడపీడలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పొలాలకు చీడపీడలు వ్యాపించే అవకాశం ఉన్నదని, కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కోరారు. పంటకు చీడపీడలు ఆశించడంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ అధికారులు పొలాలు పరిశీలించి ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు అందించాలని కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ

కొల్చారం, సెప్టెంబర్ 3: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కొల్చారం పంచాయతీలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాలతో పౌష్టికాహారం తయారు చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పాలు, గుడ్లు, ఆహారం, పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, నీరజ, మేఘమాల, స్వరూప, ఆశవర్కర్లు రాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 3: జిల్లా కేంద్రంలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్‌లో రెండు, మైక్రోబయాలజీ, కంప్యూటర్ సైన్స్, హిస్టరీలో ఒక్కో పోస్టు ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత కోర్సుల్లో పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉన్న అభ్యర్థులు ఒక జత సర్టిఫికెట్లు, బయోడేటాను ఈ నెల 6వ తేదీలోపు ఇందిరాగాంధీ స్టేడియం వద్దనున్న గిరిజన గురుకుల కళాశాలలో అందజేయాలని కోరారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈనెల 9న డెమో తరగతులు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 7901097706 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

మహిళ డిగ్రీ కళాశాలలో ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంబీజడ్సీ, బీకాం, బీఏ ప్రథమ సంవత్సరంలో ఖాళీ సీట్లకు ఈనెల 4, 5, 6వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 7901097706లో సంప్రదించాలని వివరించారు.